వేటాడి.. వెంటాడి..

- దాదాపు 25సార్లు కత్తులతో పొడిచి దారుణహత్య
- వేములవాడ పట్టణంలో కలకలం
- వివాహేతర సంబంధమే కారణం?
- విచారిస్తున్న పోలీసులు

రషీద్ (ఫైల్)

వేములవాడ, డిసెంబర్ 18: ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం కారణంగానే వెంటాడి వేటాడి చంపినట్లు తెలుస్తున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ (35) వేములవాడలోని సాయినగర్‌లో ఉంటున్నాడు. కరీంనగర్ జిల్లా గంగాధరలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. ఆ యువకుడికి ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఉండగా, ఇరు కుటుంబాల మధ్య గొడవలు తారాస్థాయికి చేరాయి. సదర వివాహితను కుటుంబసభ్యులు దూరం పెట్టడంతో ప్రస్తుతం వేములవాడలో అద్దెకు ఉంటున్నది. అయితే ఇటీవలే గల్ఫ్ నుంచి వచ్చిన ఆ వివాహిత భర్తకు రషీద్ వ్యవహారం తెలిసింది. రషీద్ తన భార్య ఇంటికి వెళ్లిన విషయాన్ని తెలుసుకుని అక్కడే మాటు వేశాడు. బుధవారం తెల్లవారుజామున రషీద్ బయటకు రావడంతో కత్తితో దాడి చేశాడు. రషీద్ తప్పించుకొని సుమారు 500 మీటర్ల వరకు పరుగులు తీయగా, చివరకు వేటాడి నరికి చంపాడు. రషీద్ తలపై 15చోట్ల, శరీరంపై పదిచోట్ల మొత్తం 25చోట్ల గాయాలున్నట్లు తెలిసింది. వివాహితతో వివాహేతర సంబంధమే హత్యకు దారితీసినట్టు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. హత్యతో సంబంధం ఉన్న వ్యక్తి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్‌బీ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్ఐలు రమేశ్, మారుతి ఘటనా స్థలాన్ని చేరుకొని విచారణ చేపట్టారు. రషీద్ బంధువు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, డిసెంబర్ 18 : మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమీకృత కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాస్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామస్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి సమస్య పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, జిల్లాలో డ్రగ్స్ మాదకద్రవ్యాల నియంత్రణకు పక్కా నిఘా ఏర్పాటు చేశామని, గత సంవత్సర కాలంగా మాదకద్రవ్యాలకు సంబంధించి 95 కేసులు నమోదు చేసి ఇందుకు సంబంధించిన 214 మందికిపైగా వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. మాదక ద్రవ్యాల సమాచారం తెస్తే కంట్రోల్ రూం నంబర్ 871 2656426కు తెలుపాలని పేర్కొన్నారు. ఇక్కడ సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, డీఏవో అష్జల్ బేగం, డీఐఈవో శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరి, విద్యాధికారులున్నారు.

ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకంచిన మేర్గు రాజేశం గౌడ్

పోతుగల్ సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మేర్గు రాజేశంగౌడ్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్లు

ముస్తాబాద్, డిసెంబర్ 18 : మండలంలోని పోతుగల్ వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ తన్నీరు బాపురావు తన వ్యక్తిగత పని మీద విదేశాలకు వెళ్లడంతో వైస్‌చైర్మన్‌గా ఉన్న మేరుగు రాజేశంగౌడ్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బుధవారం సంఘ సమావేశ మందిరంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సహకార సంఘం డైరెక్టర్లు కట్ట బాపురావు గన్నె నరసింహులు గంభీరావుపేట బాలమల్లు, మాధవరావు, వెంకట్‌రెడ్డి సహకార సంఘ సిబ్బంది రాజేశం గౌడ్‌ను అభినందించారు.

జిల్లాకు చేరుకున్న 'బస్సుజాత'

- బృందానికి ఘనంగా స్వాగతం పలికిన ఆశ కార్యకర్తలు
- గాంధీచౌక్ మీదుగా పద్మశాలీ కల్యాణ భవనం వరకు బతుకమ్మ, బోనాలతో ర్యాలీ
- అసెంబ్లీ సమావేశాల్లోనే రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలి
- ఆశ కార్యకర్తల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు పీ జయలక్ష్మి డిమాండ్

పట్టణంలో ర్యాలీ తీస్తున్న ఆశ కార్యకర్తలు

కలెక్టరేట్, డిసెంబర్ 18: ఆశ కార్యకర్తల హక్కుల సాధన కోసం సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు జాత బుధవారం రాజన్న సిరిసిల్లకు చేరుకున్నది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బస్సు జాత బృందానికి ఆశ కార్యకర్తలు ఘన స్వాగతంపలికారు. అనంతరం సిరిసిల్లలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం గాంధీచౌక్ మీదుగా పద్మశాలీ కల్యాణ భవనం వరకు పెద్దఎత్తున బతుకమ్మలు, బోనాలతో ర్యాలీ చేట్టారు. తర్వాత పద్మశాలీ కళ్యాణ భవనంలో ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బీ మంజుల అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు పీ జయలక్ష్మి మాట్లాడారు. ఆశ కార్యకర్తల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 15 నుంచి 31 వరకు బస్సుజాత చేపట్టామన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆశ కార్యకర్తలను సేవలను గుర్తించి గ్లోబల్ హెల్త్ లీడర్లుగా ప్రకటించిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం తమ శ్రమను గుర్తించడం లేదని వాపోయారు. పనికి ప్రతిఫలం లేనందున ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనాన్ని ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. బస్సుజాత బృందంలో ఆశ కార్యకర్తల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పీ జయలక్ష్మి, ఆర్ నీలాదేవి, కోశాధికారి గంగమణి, ఉపాధ్యక్షులు ఆర్ సాధన, రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత, పద్మ, రాష్ట్ర నాయకురాలు బాలమణికి ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు విప్లవ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూశం రమేశ్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ సూరం పద్మ, సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, గురజాల శ్రీధర్, ఆశ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు భారతి, యూనియన్ కార్యదర్శి జయశీల, సీఐటీయూ నాయకులు, దాదాపు 400 మంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

కోనరావుపేటలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినదిస్తున్న పంచాయతీ కార్మికులు

కోనరావుపేట, డిసెంబర్ 18: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోకు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేతనాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు చెల్లించి, పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులున్నారు.

చందుర్తి, డిసెంబర్ 18: చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్యాల నర్సయ్య సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. అనంతర పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ, పది సంవత్సరాలుగా తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు మారినా కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, ఏడాది పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యలను పరిష్కరించి పనికి తగ్గ వేతనాన్ని అందజేయాలన్నారు. ఇక్కడ పంచాయతీ ఉద్యోగులు కార్మికులున్నారు.

వీర్నపల్లి, డిసెంబర్ 18: చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న పంచాయతీ కార్మికులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అక్రమ అరెస్టు, నిర్బంధాలను నిరసిస్తూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్లను పరిష్కారించాలని నినదించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధ్రుతం చేస్తామని ఆ సంఘం మండలాధ్యక్షుడు నర్సయ్య హెచ్చరించారు.

ఇల్లంతకుంట, డిసెంబర్ 18 : గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో శశికళకు పంచాయతీ సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 18,19 తేదీల్లో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్నామని ఎంపీడీవోకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నామన్నారు. వేతనాల పెంపు, బకాయి వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం సమ్మె నోటీసు అందజేస్తున్నామన్నారు. ఇక్కడ అన్ని గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

చందుర్తి : ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పిస్తున్న పంచాయతీ కార్మికులు

అంధకారంలో బంజేరు గ్రామం

- విద్యుత్ బకాయిలు చెల్లించలేదని కరెంట్ కట్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో చీకట్లోనే తండావాసులు

వీర్నపల్లి, డిసెంబర్ 18: మొండి విద్యుత్తు బకాయిలపై సెస్ అధికారులు కొరడా ఝుళిపించారు. కొన్నేళ్లుగా రూ.43లక్షల బకాయిలున్నాయని, మండలంలోని బంజేరు గ్రామానికి సెస్ సిబ్బంది బుధవారం కరెంట్ కట్ చేశారు. గ్రామం వెలుతురు లేక అంధకారమయమైంది. దీంతో గ్రామస్తులు చీకట్లోనే మగ్గుతున్నారు. సెస్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటర్లు బంద్ ఉండడంతో తాగునీరు రావడం లేదని మండిపడ్డారు. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సెస్ ఏఈ రమేశ్‌ను వివరణ కోరగా గ్రామంలో పలువురు ఇండ్లకు సంబంధించి విద్యుత్ బిల్లులు రూ.36 లక్షలు, వ్యవసాయ బిల్లులు రూ.7 లక్షలున్నాయని తెలిపారు. వారు బిల్లులు కట్టకపోవడంతో కరెంట్ సరఫరా నిలిపివేశామని తెలిపారు. బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

తొమ్మిదో రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు


9వ రోజు కలెక్టరేట్ వద్ద దీక్షలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

కలెక్టరేట్, డిసెంబర్ 18 : సమస్యలను పరిష్కరించాలంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న దీక్ష బుధవారం 9వ రోజుకు చేరుకున్నది. ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెంలో కంప్యూటర్ ఆపరేటర్ శ్రీమతి హైమావతి మంగళవారం దీక్ష శిబిరం వద్ద గుండెపోటుతో మరణించగా, దీక్షలో సంతాపంగా మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ఆఫీస్ రోడ్డు నుంచి రగుడు రోడ్డు వరకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ట్రస్మా చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు, బండారి రాజ్‌కుమార్ సతీమణి సాయి కృష్ణప్రియ బుధవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల జాక్ ప్రతినిధులతోపాటు డీఈవో స్టాఫ్ శ్రీనివాస్, నరేందర్, రమణ, పార్ట్‌టైం ఇన్‌స్పెక్టర్లు, రాధాకిషన్, శ్రీదేవి, ఐఆర్పీలు కల్యాణి, సునీత, సీఆర్టీలు వెన్నెల, శోభారాణి, శ్రీలత, సుష్మ, దివ్య, స్వప్న, అన్ని మండలాల కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్స్, టీచర్స్ సమగ్ర శిక్ష అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి తెలుపండి

- టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను కలిసిన రాష్ట్ర దేవాలయాల జేఏసీ నాయకులు

హైదరాబాద్ టీఎన్జీవో భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న వేములవాడ రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం నాయకుడు కూరగాయల శ్రీనివాస్

వేములవాడ, డిసెంబర్ 18: రాష్ట్రంలోని దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రాష్ట్ర టీఎన్జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను రాష్ట్ర దేవాలయాల జేఏసీ చైర్మన్ రమేశ్ ఆధ్వర్యంలో పలు దేవాలయ ఉద్యోగులు హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. దేవాలయాల్లోని ఉద్యోగుల బదిలీలు జరిగిన నేపథ్యంలో సమస్యలను టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి తిరిగి మాతృ సంస్థకు పంపాలని కోరినట్లు తెలిపారు. తక్కువ వేతనం ఉన్న ఉద్యోగులను కూడా పరిశీలించాలని చెప్పామన్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న ఉద్యోగులను కూడా మాతృ సంస్థలకు పంపేలా పునరాలోచించాలని కోరినట్లు తెలిపారు. ఇక్కడ రాష్ట్ర దేవాలయాల జేఏసీ చైర్మన్ రమేశ్, రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్, ప్రతాప నవీన్, మహేశ్, నిరంజన్, కృష్ణగౌడ్ వేములవాడ, యాదగిరి గుట్ట, కొండగట్టు, భద్రాచలం, బాసర, కొమురవెల్లి ఆలయ ఉద్యోగులున్నారు.

అన్ని గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలి

- కరీంనగర్ జోన్ ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్
- సిరిసిల్ల ఆర్టీసీ డిపో సందర్శన

కరీంనగర్ జోన్ ఆర్టీసీ ఈడీని సన్మానిస్తున్న సిరిసిల్ల డీఎం ప్రకాశ్‌రావు

కలెక్టరేట్, డిసెంబర్ 18 : జిల్లాలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ అన్నారు. బుధవారం ఆయన కరీంనగర్ రీజినల్ మేనేజర్ బీ రాజుతో కలిసి సిరిసిల్ల ఆర్టీసీ డిపోను సందర్శించారు. 'మహాలక్ష్మి' ప్రయాణికులకు ఇబ్బందులేకుండా చూడాలన్నారు. సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశ్‌రావును బస్సు రూట్లపై వచ్చే ఆదాయంపై ఆరా తీశారు. ఇక్కడ డి ప్యూటీ ఆర్ఎం(వో) భూపతి రెడ్డి, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ఆఫీస్ సూపర్‌వైజర్లు, గ్యా రేజ్ సూపర్‌వైజర్లు, ఉద్యోగులున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

వీర్నపల్లి, డిసెంబర్ 18: గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం బస్సుల సంఖ్య పెంచి హైదరాబాద్ వరకు నడిపించాలని కరీంనగర్ ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్‌ను గర్జనపల్లి గ్రామస్తులు కోరారు. సిరిసిల్లలో ఈడీని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. మరిమడ్ల నుంచి వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల మీదుగా హైదరాబాద్‌కు, కోరుట్ల బస్సును అడవిపదిర, ఎర్రగడ్డతండా మీదుగా ఎల్లారెడ్డిపేట వరకు నడుపాలని విన్నవించారు. ఇక్కడ డీఎం ప్రకాశ్‌రావు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మానువాడ భూమయ్య, గజ్జెల ప్రశాంత్ ఉన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

నూతన వధువరులతో వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నేతలు

కోనరావుపేట, డిసెంబర్ 18: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మందాల శ్రీనివాస్ కూతురు ప్రత్యూష వివాహం బుధవారం కాగా వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, యువజన విభాగం మండలాధ్యక్షుడు ముప్పుం జీవన్‌గౌడ్, సీనియర్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Kunduri Nagendra Babu S/o. Subbarao (Old Name) H.No: 3-5-35/A, Shanthinagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. my Name was changed to Kunduru Nagendra Babu, S/o. Subbarao (New Name) TTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

ట్రాక్టర్ పరికరాల చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 18: బొప్పాపూర్‌లోని మొడుసు వెంకటేశ్‌కు చెందిన ట్రాక్టర్‌కు బిగించి ఉన్న పరికరాలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుడు బుధవారం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ట్రాక్టర్‌కు బిగించి ఉన్న రూ.20వేల విలువ చేసే బ్యాటరీ, సెల్ఫ్ మోటర్, లెవెల్ అడ్జస్ట్‌మెంట్‌ను దొంగిలించారని వెంకటేశ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దాబాపై పోలీసుల దాడులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 18: బండలింగంపల్లి శివారులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్వహిస్తున్న దాబాపై టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, బండలింగంపల్లి గ్రామానికి చెందిన కీసరి శ్రీనివాస్ గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా దాబా నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో సీఐ స్థానిక పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి రూ.67వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. అందుకు బాధ్యుడైన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఇక్కడ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సుధాకర్, పీఎస్ఐ లక్ష్మణ్, సిబ్బంది తిరుపతి, రాజేశ్ తదితరులున్నారు.

టీబీపై అపోహలు వద్దు

వీర్నపల్లి, డిసెంబర్ 18: టీబీ వ్యాధిపై అపోహలు పెట్టుకోవద్దని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంత్‌రావు అన్నారు. మండలంలోని గర్జనపల్లిలో ఏర్పాటు చేసిన టీబీ అవగాహన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీబీ వ్యాధి గాలితుంపర్ల ద్వారా సోకే ప్రమాదం ఉందన్నారు. టీబీ రహిత గ్రామాలుగా గుర్తించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. టీబీ మందులు వాడుతున్న వారి కుటుంబ సభ్యులు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. సుమారు 80 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ నిశ్చయ్ శిబిర్ డాక్టర్ విష్ణు, డాక్టర్లు దివ్య, సారియా, బ్లెస్సీ, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకులకు సన్మానం

కోనరావుపేట, డిసెంబర్ 18: మండలంలోని సుద్దాల గ్రామంలో ఇటీవల పోలీసు ఉద్యోగాలు సాధించిన యువకులు పల్లి వేణు, అలువాల అరవింద్‌ను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. యువకులను ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని యువకులు ముందుకు వెళ్లాలని సూచించారు. ఇక్కడ సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్ యాదవ్, నేతలు కాశవేణి మహేశ్ యాదవ్, కచ్చకాయల మహేశ్, వంగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడి బయట విద్యార్థుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే

కలెక్టరేట్, డిసెంబర్ 18 : బడి బయట ఉన్న విద్యార్థుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ ఎన్.భీమ్యానాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా విద్యా శాఖ, కార్మికశాఖ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ, పోలీసు శాఖలతో అదనపు కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈనెలలో చేపట్టనున్న బడి బయట విద్యార్థుల సర్వేపై పలు సూచనలు చేశారు. ప్రతి పాఠశాలలో ఒక నెల కంటే ఎక్కువగా గైర్హాజరైన విద్యార్థులను గుర్తించి వారిని బడిబయట విద్యార్థులుగా (ఓఎస్‌సీ) గుర్తించాలని తెలిపారు. ఇక్కడ జిల్లా విద్యాధికారి జగన్ మోహన్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, కార్మిక శాఖాధికారి నజీర్ అహ్మద్ తదితరులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

రుద్రంగి, డిసెంబర్ 18: క్రీడలతోనే మానసిక, శారీరకోల్లాసం కలుగుతుందని రుద్రంగి ఎస్ఐ అశోక్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ఫిట్నెస్ ఫ్రీక్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన షెటిల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ విజేతలకు ఎస్ఐ అశోక్ మంగళవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిట్నెస్ ఫ్రీక్ బ్యాడ్మింటన్ క్లబ్ క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

వేములవాడ, డిసెంబర్ 18: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధి ప్రాంతంలో విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైందని రైతులు బుధవారం వాపోయారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు మాట్లాడుతూ, మహాలక్ష్మి వీధిలోని పిల్లి నర్సయ్యకు చెందిన పశుగ్రాసం విద్యుత్ తీగల ద్వారా వచ్చిన మెరుపులతో పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. సెస్ అధికారుల నిర్లక్ష్యంతో పశుగ్రాసం దగ్ధమైనందున బాధిత రైతుకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు

డిజిటల్ ఈక్వలైజర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 18: అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాల